బిజెపి కార్మిక వ్యతిరేకి

- మతోన్మాదం, సరళీకరణ రెండూ దేశానికి ప్రమాదకరం
- మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాటాలకు నిర్ణయం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేకని, మతోన్మాదం, సరళీకరణ రెండూ దేశానికి ప్రమాదకరకని, వాటి పర్యవసానాలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ పోరాటాలను నిర్ణయిస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ తెలిపారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో సిద్ధిపేటలో నిర్వహించనున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. మహాసభ సన్నాహక సమావేశం సందర్భంగా సోమవారం సిద్దిపేటలోని శివమ్స్ గార్డెన్, రెడ్డి సంక్షేమ భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభ ప్రాంగణానికి మల్లు స్వరాజ్యం, సున్నం రాజయ్య పేర్లను ప్రతిపాదించినట్టు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు మహాసభకు హాజరుకానున్నట్టు చెప్పారు. మూడ్రోజులపాటు కొనసాగే



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కరాములు, పాలడుగు భాస్కర్

మహాసభకు ఇతర కార్మిక సంఘాలనూ ఆహ్వానిస్తున్నామన్నారు. చివరి రోజు 23వ తేదీ జరిగే భారీ బహిరంగ సభకు కేరళ కార్మిక శాఖ మంత్రి శివమ్స్ కుట్టి, టిఎన్‌జిఓఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మహాసభకు హాజరుకానున్నట్టు తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను మార్చి నాలుగు కోడ్లుగా విభజించిందన్నారు. దాంతో కార్మికులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. బిజెపి పాలన ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్మిక చట్టాలు, ధరల పెరుగుదల, విద్యుత్ చట్టం, రైతాంగ సమస్యలపై ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల కొత్త చట్టాన్ని సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఆర్‌టిసి కార్మికులకు ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కోరారు. బిఆర్ఎస్ జయప్రదం కావాలంటే కొన్ని సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మతోన్మాద బిజెపి పై పోరాటం చేయడానికి ఏర్పడ్డ బిఆర్ఎస్ ఆందోళనలకు భవిష్యత్తులో మద్దతు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మహాసభకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మహాసభ ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, శశిధర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, ఆహ్వాన సంఘం కార్యదర్శి గోపాలస్వామి, అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షులు పద్మ పాల్గొన్నారు.

పట్టించుకోనేవారేలేరా..

- వ్యకాస ఆధ్వర్యంలో గుడిసెలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీసం గూడు కోసం పోరాటం చేస్తున్న గుడిసె వాసులను పట్టించుకోనే నాధుడే కరువయ్యారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరాజం, నాయకులు బోడ్డు కరుణాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల, పటేల్ గూడెం మధ్యనున్న ప్రభుత్వ భూమిలో ఇళ్లు లేని నిరుపేదలు సోమవారం సుమారు 15 వందల గుడిసెలు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని కలిసి మద్దతు తెలిపి మాట్లాడారు. చుట్టుపక్కనున్న 15 గ్రామాల ప్రజలు 14 రోజులు నుంచి నానా అవస్థలు పడుతూ చిన్న పిల్లలని పట్టుకొని అక్కడే ఉంటున్నారు. చీకట్లలో పాములు వస్తోయో.. తేళ్లవస్తాయో.. అని క్షణక్షణం భయపడుతూ ఉంటున్నామని గుడిసెవాసులు తెలిపారు. ఇప్పటిదాక ఏ ఒక్క అధికారి కానీ, అధికార పార్టీ నాయకులు గానీ వారి వద్దకు వచ్చి వారి బాగోగులు అడిగిందే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల అడిగేందుకు వచ్చిన నాయకులకు తాము కనబడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వారి బాధలను అర్థం చేసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఇంటిస్థలం పట్టాతో పాటు పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసులకు వ్యకాసతో పాటు సిపిఎం మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు తూటి దేవాదానం శంకరయ్య ఉన్నారు.

వ్యవస్థల పతనాన్ని అడ్డుకోవాల్సింది న్యాయ వ్యవస్థే

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం

ప్రజాశక్తి -కల్చరల్

రాజకీయ విధానం వల్లే కార్యనిర్వాహక వ్యవస్థ నేడు పతనావస్థలో వుందని ఇట్టి పరిస్థితులలో నేడు న్యాయ వ్యవస్థ పైనే సమాజాన్ని సక్రమ విధానంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత వుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం అన్నారు. ఇందుకు ఉత్తములు న్యాయమూర్తులుగా ఎంపిక కావాలని ఆయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై డాక్టర్ సాగి వెంకట రామ కష్ణ రచించిన వాయిస్ ఆఫ్ థాట్ ఆంగ్ల కవితా సంపుటి అవిస్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ చల్లా కోదండరాం సంపుటిని అవిస్కరించి మాట్లాడారు. నేడు సామాజిక నిర్మాణం అపసవ్యం గా ఉందని ప్రతి వ్యక్తి వారికి వారే సక్రమంగా ప్రవర్తించవలసిన అవసరం ఏర్పడిందన్నారు ఇందుకు వ్యక్తికి శీలం ముఖ్యమన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- సమాచార డైరెక్టర్‌కి టిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వినతి పత్రం అందజేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ బృందం

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత నెల 27న హైదరాబాద్‌లోని జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలో ఆమోదించిన పలు తీర్మానాలు, రాష్ట్ర నూతన కార్యవర్గంతో కూడిన వివరాలను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధానకార్యదర్శి బి బసవపున్నయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సోమవారం సమాచార శాఖ డైరెక్టర్ బి రాజమౌళిని కలిసి సమర్పించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్లు, ఇళ్లస్థలాల సమస్యలతో పాటు చిన్నపత్రికల సమస్యలు, జర్నలిస్టు బంధు పథకం, పెన్షన్ విధానం, ఆరోగ్య భీమా, అక్రెడిటేషన్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎర్రం నర్సింగ్‌రావు, ఎస్ కె సలీమా, హెచ్‌యుజె అధ్యక్షులు బి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు పి నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి
- బల్దియా కార్యాలయం ఎదుట మహాధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట రెండు గంటలపాటు సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళనకారులు పెద్దఎత్తున చేసిన నినాదాలతో బల్దియా దద్దరిల్లింది. ఈ ధర్నానుద్దేశించి ఆ పార్టీ జిల్లా కన్వీనర్ బోట్ల చక్రపాణి మాట్లాడుతూ.. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పది రోజుల నుంచి 63 బృందాల ద్వారా 600 మంది కార్యకర్తలు, నాయకులు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ నగరాభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి కేవలం రూ.246 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. అష్యూరెన్స్ పథకం కింద రూ.300 కోట్లు ప్రతి ఏటా కేటాయిస్తామని



సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తున్న వరంగల్ వాసులు

సిఎం చెప్పారని, అందులో ఎన్ని నిధులు ఇచ్చారో మున్సిపాలిటీ పాలక మండలి శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. హనుమకొండ నగరంలో సమ్మయ్యనగర్, ఇంజనీర్స్ కాలనీ, వాజ్‌పేయికాలనీ, దీన్‌దయాళ్ నగర్, ప్రగతి నగర్, నాగేంద్రనగర్ సూర్జిత్ నగర్, పలివేల్పుల భగత్ సింగ్ నగర్, పెద్దమ్మగడ్డ జ్యోతిబసు నగర్ పేజ్ - 1, ఫేజ్-2, కోమల్లకుంట, మడికొండ యంఎన్ నగర్ మొదలైన కాలనీలు.. వర్షం వస్తే నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనేక కాలనీల్లో రోడ్లు సరిగా లేక డక్, డ్రైన్ పనులు ఏడాదికాలంగా నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే వేగవంతంగా పూర్తిచేసి వందడుగుల రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న కుటుంబాలకు ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, నల్లా పన్నులను రద్దు చేయాలని, మంచి నీటి నల్లాల లీకేజీలను అరికట్టాలని కోరారు. పగటిపూట సురక్షితమైన మంచినీటిని ఇవ్వాలని, ఐదు శ్మశానవాటికల్లో ప్రహరిగోడ, వాటర్, కరెంట్ లైట్లు, తదితర మౌళిక వసతులు కల్పించాలన్నారు. రాంపూర్ డంపింగ్ యార్డు రీ-సైక్లింగ్ పనులు నిరంతరం చేపట్టాలని దీనికి మిషన్లను పెంచాలని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్, పిచికారి అన్ని కాలనీల్లో రెగ్యూలర్ చేయాలని, 57 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర రంగాల కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని కోరారు. పూరిగుట్టలో ప్రారంభించిన బస్తీ దవాఖానలో డాక్టర్, సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకరావాలి. గ్రేటర్ వరంగల్‌లో పదెకరాల స్థలం కేటాయించి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన చేపల హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన 'కుడా' స్థలాలను రియల్ ఎస్టేటర్స్ నుంచి రక్షించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలన్నారు. కాగా, ధర్నా శిబిరం వద్దకు వచ్చిన అదనపు కమిషనర్ అనుసూర్ రషీద్‌కు వినతిపత్రం అందజేయగా, ఆయన మాట్లాడారు. 15 రోజుల్లో జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మహా ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి ప్రభాకర్‌రెడ్డి, ఎం చుక్కయ్య, టి ఉప్పలయ్య, వీరన్ననాయక్, రాగుల రమేష్, గొడుగు వెంకట్, జి.రాములు, తిరుపతి, మంద సంపత్, డి భానునాయక్, లేచేలా దీప, తొట్టె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి అధికారులు, సిబ్బందితో మంత్రి హరీశ్‌రావు

గర్భిణిలకు త్వరలో కెసిఆర్ న్యూట్రిషన్ కిట్

- హంస హోమియో మెడికల్ కాలేజీలో.. బోధనాస్పత్రిని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పౌష్టికాహారం అందని గర్భిణీలకు తెలంగాణ ప్రభుత్వం త్వరలో కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించబోతోందని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించవచ్చని చెప్పారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరాసాగర్ గ్రామంలో హంస హోమియో మెడికల్ కాలేజీలో 75 పడకల బోధనాస్పత్రిని సోమవారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ఆయుష్‌కు మంచి భవిష్యత్ ఉందని, సంప్రదాయ వైద్యానికి ప్రాధాన్యత పెరుగుతున్నదని తెలిపారు. కెసిఆర్ నాయకత్వంలో బస్తీ, పల్లె దవాఖానాలు తెచ్చామన్నారు. పల్లె దవాఖానాల్లో పని చేసేందుకు ఆయుష్ డాక్టర్లను రిక్రూట్ చేస్తున్నామని చెప్పారు. తల్లికి మొదటి గంటలో పాలు రాకపోవడంతో పుట్టే పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చే అవకాశం కోల్పోతున్నామన్నారు. దీని నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎఫడిసి చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డిసిసిబి చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మెన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మెన్ కుక్కల నరేష్ గౌడ్, హంస హోమియోపతి ఫౌండర్ సన్ డైరెక్టర్ ఉమేష్ అక్కలదేవి, డైరెక్టర్ డాక్టర్ పద్మజ, ప్రిన్సిపాల్ న్యూరోస్ సాహెర్ ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ బాబు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఫిబ్రవరి 15 నుంచి ప్రాక్టికల్స్
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షలు-2023, మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరుగుతాయి. జనరల్‌తోపాటు ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తించనుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరగనున్నాయి. వచ్చేఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి రెండో తేదీ వరకు ఇంటర్మీడియెట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలుంటాయి. ప్రతి రోజూ రెండువిడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలుంటాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం పరీక్షల షెడ్యూల్ (టైంటేబుల్)ను విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేఏడాది మార్చి నాలుగో తేదీన నైతికత, మానవ విలువలు రాతపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మార్చి ఆరో తేదీన పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

ఇంటర్ పరీక్షల టైంటేబుల్ (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు)

తేదీ	మొదటి సంవత్సరం	తేదీ	ద్వితీయ సంవత్సరం
15.03.2023 (బుధవారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1	16.03.2023 (గురువారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
17.03.2023 (శుక్రవారం)	ఇంగ్లీష్ పేపర్-1	18.03.2023 (శనివారం)	ఇంగ్లీష్ పేపర్-2
20.03.2023 (సోమవారం)	మ్యాథమెటిక్స్ పేపర్-1ఎ, బాటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1,	21.03.2023 (మంగళవారం)	మ్యాథమెటిక్స్ పేపర్-2ఎ, బాటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2,
22.03.2023 (బుధవారం)	మ్యాథమెటిక్స్ పేపర్-1బి జువాలజీ పేపర్-1 హిస్టరీ పేపర్-1	24.03.2023 (శుక్రవారం)	మ్యాథమెటిక్స్ పేపర్-2బి జువాలజీ పేపర్-2 హిస్టరీ పేపర్-2
25.03.2023 (శనివారం)	ఫిజిక్స్ పేపర్-1 ఎకనామిక్స్ పేపర్-1	27.03.2023 (సోమవారం)	ఫిజిక్స్ పేపర్-2 ఎకనామిక్స్ పేపర్-2
28.03.2023 (మంగళవారం)	కెమిస్ట్రీ పేపర్-1 కామర్స్ పేపర్-1	29.03.2023 (బుధవారం)	కెమిస్ట్రీ పేపర్-2 కామర్స్ పేపర్-2
31.03.2022 (శుక్రవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1 బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-1 (బైపీసీ విద్యార్థులకే)	01.04.2023 (శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2 బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-2 (బైపీసీ విద్యార్థులకే)
03.04.2023 (సోమవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1 జాగ్రఫీ పేపర్-1	04.04.2023 (సోమవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2 జాగ్రఫీ పేపర్-2

ఆఖిలపక్షం ఆధ్వర్యంలో..

భద్రాచలం బంద్ విజయవంతం..

- కుగ్రామంగా మారుస్తున్న పాలకులు
- జిఓ 45ను వెంటనే రద్దు చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బంద్ చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ నాయకులు

భద్రాచలాన్ని జిఓ నెంబర్ 45 ద్వారా మూడు పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ ఆధ్వర్యంలో భద్రాచలం సంపూర్ణంగా బంద్ పాటించారు. వ్యాపారులు, దుకాణాదారులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారు. ఆయా పార్టీల నాయకులు ఎవరికివారుగా బైక్ ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గం అనేక విధాలుగా ఇప్పటికే చాలా నష్టపోయిందని, అది చాలదన్నట్టు మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టుగా మూడు గ్రామపంచాయతీలుగా విభజించి మరింత కుగ్రామంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు భద్రాచలం పార్లమెంటు నియోజకవర్గం భారతదేశంలోనే రెండవ అతిపెద్ద నియోజకవర్గంగా ఉండేదని, దాన్ని మార్చి మహబూబాబాద్ నియోజకవర్గంగా చేశారని, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే పెద్ద నియోజకవర్గంగా ఉండేదని, అటువంటి కేంద్రాన్ని 2014లో తెలంగాణ విభజన పేరుతో నాలుగు మండలాలని, పట్టణంలోని కొంత భాగాన్ని ఎపిలో కలిపారని, మరల జిల్లాల విభజనలో భాగంగా నియోజకవర్గంలోని రెండు మండలాలను ములుగు జిల్లాలో కలిపారని అన్నారు. ఆ విధంగా నష్టపోయినటువంటి భద్రాచలాన్ని మూడు గ్రామపంచాయతీలుగా విభజించి భద్రాచలానికి ఉన్నటువంటి ప్రాముఖ్యతను చారిత్రాత్మకమైనటువంటి ప్రాంతంగా ఉన్న దానిని ఒక కుగ్రామంగా మార్చటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని తెలిపారు. 45 జిఒను రద్దు చేసి, మేజర్ పంచాయతీగా ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని, ప్రజా పరిపాలన కొనసాగించాలని కోరుతూ జరిగిన బంద్ విజయవంతం అయిందన్నారు.

ఉన్న భద్రాచలానికే డంపింగ్ యార్డ్ లేక ఇబ్బందులు పడుతూ ఉంటే మూడు గ్రామ పంచాయతీలకు ఏ విధంగా డంపింగ్ యార్డు సమకూరుస్తారని, అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి కేటాయిస్తారని, సరిహద్దుల పేరుతో పట్టణ ప్రజలను గందరగోళానికి గురి చేయొద్దని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి భద్రాచలాన్ని కాపాడాలని కోరారు. భద్రాచలం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భద్రాచలం పరిరక్షణ కోసం పోరాడుతానని తెలిపారు. విభజన జిఒను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, సిపిఐ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న రైతులు

రైతుల ధర్నా

- ట్రిబుల్‌ఆర్ సర్వే పనులు నిలిపేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ అభిప్రాయాలను తీసుకోకుండా చేపడుతున్న ట్రిబుల్‌ఆర్ సర్వే పనులను నిలిపివేయాలని కోరుతూ రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. రూరల్ ఎస్ఐ హెచ్ రాఘవేందర్ గౌడ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. అనంతరం రైతులు కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు తంగేళ్లపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. భువనగిరి మండలంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, పంట పొలాలు, వ్యవసాయ భూముల గుండా ట్రిబుల్ ఆర్ రోడ్డు వస్తుందన్నారు. దీంతో రైతులందరం కలిసి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశామన్నారు. రైతులకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధంగా సర్వే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సర్వే పనులను ఆపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సర్వే చేసే ముందు తమ అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పల్లెర్ల యాదగిరి, అవిశెట్టి పాండు, ఎలిమినేటి మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, జ్యోతి, లక్ష్మి, మహేష్, ఐలయ్య, శ్రీకాంత్, వైకుంఠం, శంకర్‌గౌడ్, పాపమ్మ, కౌసల్య, పద్మ, రేఖ, వనజ, స్వామి పాల్గొన్నారు.

కార్పొరేటర్ మేనల్లుడి హత్య

- కత్తులతో దుండగుల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పాతబస్తీలో కార్పొరేటర్ కార్యాలయంలో అతని మేనల్లుడు దారుణ హత్యకు గురయ్యాడు. జిహెచ్ఎంసి పరిధిలోని లలిత్‌బాగ్ ఎంఐఎం కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం యువకుడిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లలితాబాగ్‌కు చెందిన ఎంఐఎం కార్పొరేటర్ ఆజం షరీఫ్ కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. కార్పొరేటర్ ఆజం షరీఫ్ సోదరి కొడుకు సయ్యద్ ముర్తుజా(18)పై కత్తులతో దాడి చేశారు. ముర్తుజా బంజారాహిల్స్‌లోని అన్వర్ ఉలూమ్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. అయితే, స్నేహితుల మధ్య గొడవే ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. కార్పొరేటర్ కార్యాలయంలో ఉండగానే ఆరుగురు వ్యక్తులు ముర్తుజాపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాటా ప్లే బింగేలో మరో ఓటిటి వేదిక

ప్రజాశక్తి- హైదరాబాద్

టాటా ప్లే బింగేలో కొత్తగా మరో ఓటిటి వేదిక రీల్ డ్రామాను చేర్చడానికి భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఇందులో అసోమీ కంటెంట్‌ను అందించనున్నట్లు తెలిపింది. తన ప్రాంతీయ ఆఫర్లను విస్తరించిన టాటా ప్లే బింగే 180 ఓటిటి ప్లాట్‌ఫారం యాప్‌లతో డీల్స్ విస్తృత భాగస్వామ్యంతో వీక్షణకులకు దేశంలోని అన్ని ప్రముఖ, ప్రాంతీయ సంస్థలతో ఆకర్షణీయమైన కంటెంట్‌ను ఒకే క్లిక్‌లో అందిస్తోన్నట్లు తెలిపింది.

రేవంత్ రెడ్డికి పిటిషన్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్చడంపై సంబంధిత శాఖలు, సంస్థలను ప్రతివాదులుగా చేర్చుతూ వేరే పిటిషన్ దాఖలు చేయడానికి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. 2018లో టిఆర్ఎస్ పార్టీ చేపట్టిన బంగారు కూలీ కార్యక్రమం పేరిట నిధుల సమీకరణ చేపట్టిన క్రమంలో రేవంత్ రెడ్డి ఓ పిటిషన్ వేశారు. రేవంత్ లేవనెత్తిన అంశాలను అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని 2018 జనవరి ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసి విచారణను ముగించింది. అయితే, హైకోర్టు ఆదేశాల మేరకు ఐటీ శాఖ అధ్యయనం ఇంకా పూర్తికాలేదని, ఆ లోపు టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్‌గా ఎన్నికల సంఘం గుర్తించడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ తాజాగా రేవంత్ రెడ్డి అప్లికేషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం నాడు విచారణ జరిపిన హైకోర్టు వేరే పిటిషన్‌ను దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

రేపు ఎల్‌బి స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో ప్రభుత్వం తరపున బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్టు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సిఎం కెసిఆర్ క్రైస్తవ సోదరులకు విందు ఇవ్వనున్నారని వెల్లడించారు. వేడుకల్లో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతున్నట్టు సంబంధిత శాఖ అధికారులు మంత్రికి వివరించారు. అందులో భాగంగా ఆరు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ రాజీవ్ సాగర్, మైనారిటీ శాఖ సలహాదారు ఏ.కే. ఖాన్, శంకర్ లూక్, మైనారిటీ కార్పొరేషన్ ఎండి క్రాంతి వెస్లీ, క్రిస్టియన్ కమ్యూనిటీ ప్రతినిధులు రాయడన్ రోస్, విద్యా స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వాద్వానీ ఎంటర్‌ప్రెన్యూర్ బాస్‌గా మీతుల్ పటేల్

బెంగళూరు : వాద్వానీ ఎంటర్‌ప్రిన్యూర్ ప్రెసిడెంట్‌గా మీతుల్ పటేల్‌ను నియమించినట్లు వాద్వానీ ఫౌండేషన్ వెల్లడించింది. వాద్వానీ ఫౌండేషన్ యొక్క కార్యక్రమాలకు మీతుల్ నేతృత్వం వహించడంతో పాటుగా వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, చిరు వ్యాపారాల వద్ధిని వేగవంతం చేయడంపై దష్టి సారించనున్నారని ఆ సంస్థ తెలిపింది. మితుల్ నియామకంతో తమ కార్యకలాపాల విస్తరణ మరింత బలోపేతం కానున్నాయని ఆ సంస్థ విశ్వాసం చేసింది. మీతుల్ చివరగా మైక్రోసాఫ్ట్ ఇండియాలో స్ట్రాటజిక్ గ్రోత్‌కు నేతృత్వం వహించారు.

హెచ్‌డిఎఫ్‌సి కొత్తగా 100 శాఖల ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ దేశ వ్యాప్తంగా కొత్తగా 100 శాఖలను తెరిచినట్లు ప్రకటించింది. ఇటీవల 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కొత్త శాఖలను బ్యాంకు ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ శశిధర్ జగదీశన్ వర్చ్యువల్‌గా ప్రారంభించారని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 425 రిటైల్ శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా డిసెంబర్ 15 నాటికి దేశ వ్యాప్తంగా మొత్తం 6,762 శాఖలకు విస్తరించినట్లయ్యిందని తెలిపింది.

26 నుంచి 28 వరకు ఎన్‌పిఆర్‌డి జాతీయ మూడో మహాసభ

- 27న జాతీయ సదస్సు, మంత్రుల హాజరు
- ఆహ్వాన సంఘం వైస్ చైర్మెన్ చెరుపల్లి సీతారాములు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎన్‌పిఆర్‌డి అఖిల భారత మూడవ మహాసభ యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్‌లో జరగనున్నట్టు ఆహ్వాన సంఘం వైస్ చైర్మెన్ చెరుపల్లి సీతారాములు వెల్లడించారు. సెయింట్ మేరీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఈనెల 26 నుంచి 28 వరకు ఈ మహాసభ నిర్వహిస్తామన్నారు. పోచంపల్లి మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం మహాసభ ఆహ్వానసంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా అఖిల భారత మహాసభ జరగనున్నట్టు తెలిపారు. ప్రసిద్ధి పొందిన పర్యాటక ప్రాంతం పోచంపల్లి అన్నారు. అలాంటి మండలంలో జాతీయ మహాసభ జరగడం గొప్ప విషయమన్నారు.

తెలంగాణ సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా మహాసభ జరిపేందుకు ఆహ్వాన సంఘం కృషి చేస్తోందని తెలిపారు. వీటిని జయప్రదం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను తయారు చేయడానికి ఈ మహాసభ దోహదపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వికలాంగుల వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను మార్చేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయడం ద్వారా వికలాంగులు రిజర్వేషన్ సౌకర్యం కోల్పోతారని చెప్పారు.

ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. మహాసభకు 22 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం, నామినేటెడ్ పదవుల్లో రిజ్వేషన్ల అమలు, రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయకపోవడం, వికలాంగులపై దాడులు దౌర్జన్యాలు, మహిళావికలాంగులపై లైంగిక వేధింపులపై చర్చిస్తామన్నారు. వికలాంగుల విద్యా, ఉపాధి, ఆరోగ్యం, సంక్షేమం, సాధికారతపై 27న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేరళ సోషల్ జస్టిస్ మంత్రి డాక్టర్ ఆర్.బిందు, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కె వాసుదేవరెడ్డి, డైరెక్టర్ బి శైలజ, హెలెన్ కెళ్ళార్ విద్యాసంస్థల అధినేత ఉమర్‌ఖాన్, టిఎఎస్ఎల్‌పిఎ అధ్యక్ష కార్యదర్శులు నాగేందర్, ఇమద్‌ఖాన్, సెయింట్ మేరీ విద్యాసంస్థల చైర్మెన్ కెవికె రావు, శాస్త్రవేత్త పి జాని హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం వైస్‌చైర్మెన్ టి జ్యోతి, జహంగీర్, కొండమడుగు నర్సింహ, ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ఉపాధ్యక్షులు టి వరమ్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉపేందర్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్య పోరాటశీలి సుశీల గోపాలన్

- ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుశీల గోపాలన్ నిత్య పోరాట యోధురాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ భవన్‌లో సుశీల గోపాలన్ 21వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి కెఎన్ ఆశాలతతోపాటు ఐద్వా నేతలు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సుశీలగోపాలన్ మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం తొలి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. మూడుసార్లు పార్లమెంట్ సభ్యులుగా, కేరళ పిడిఎఫ్ ప్రభుత్వంలో పరిశ్రమలు, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు. మహిళల హక్కులు, చట్టాలు, సంస్కరణలు, వరకట్న నిర్మూలన వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు వచ్చే విధంగా కృషి చేశారని తెలిపారు. జనవరిలో కేరళలో ఐద్వా జాతీయ 13వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో జెండా అవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ భవనం ముందు ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి జెండా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు పి శశికళ, ఎం వినోద, రాష్ట్ర కమిటి సభ్యులు ఎ పద్మ, ఎమ్ స్వర్ణలత, స్వరూప,పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.





జర్నలిస్టుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

- మంద కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అనాథల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అనాథ పిల్లల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటయ్య, తిప్పారపు లక్ష్మణ్‌రావు, గణేష్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనాథ పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి అమ్మా నాన్న ప్రభుత్వమేనంటూ 2015లో సిఎం కెసిఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఆ దిశగా వారి వికాసానికి తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. అనాథ పిల్లలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీ చేసిన సూచనలను కూడా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సిసిఎల్ఎ మూడుసార్లు పలు రికమండేషన్లు ఇచ్చినా పట్టించుకోలేదంటే వారి పట్ల ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నదని చెప్పారు.

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2014లో బిఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారనీ, ఆ హామీని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారి సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు పొందిన సంఘాలతో, రాజకీయ పక్షాలతో తాము రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు బిజెపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి ఎంపిలు బండి సంజయ్, అరవింద్ బాబురావు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వర్గీకరణ విషయంలో బిజెపి తాత్సారం చేస్తే రానున్న కాలంలో రాష్ట్రంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కూలి, భూమి పోరాటాలకు సిద్ధం కావాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలో జూలకంటి పిలుపు


మహాసభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాటి వీర తెలంగాణ పోరాట యోధులు, అమరుల స్ఫూర్తితో మళ్లీ కూలి, భూమి పోరాటాలకు వ్యవసాయ కార్మికులు సిద్ధమవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల కేంద్రంలోని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంనగర్ వైవిఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 19వ మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా నేటికీ నూటికి 80 శాతం ఉన్న పేదలకు నిలువ నీడ లేని దుస్థితి ఉందన్నారు. పాలకుల విధానాలే ఈ దుస్థితికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. బురద నుంచి బువ్వ తీస్తున్న వ్యవసాయ కూలీలకు కూడు, గూడు, గుడ్డ, విద్యావైద్యం అందని ద్రాక్షలా తయారయ్యాయని అన్నారు. అందుకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. హక్కుల కోసం రైతులు, కూలీలు ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ఫలితంగా.. వామపక్షాల ఒత్తిడితో 2005లో ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసల నివారణ జరిగిందన్నారు. పేదలకు కూలి రేట్లు పెరిగాయని, వారిలో చైతన్యం ఈ చట్టం ద్వారానే వచ్చిందని చెప్పారు. నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసి యువతకు ఉపాధి లేకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టం నిధులను ఈ ఏడాది రూ.లక్ష కోట్ల నుంచి రూ.73 వేల కోట్లకు కుదించడం దారుణమన్నారు. రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి పేదలపై భారాలు మోపిన మోడీ ప్రభుత్వ విధానాలపై సమరశంఖం పూరించాలన్నారు. 2013లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కనీస వేతనం జీవోను నేటికీ సవరించలేదన్నారు. రెండేండ్లకోసారి పెరుగుతున్న నిత్యావసరాల ధరలకనుగుణంగా కూలి రేట్ల జీఓను మార్చాల్సి ఉండగా, 9 ఏండ్లవుతున్నా ఎలాంటి మార్పులకు నోచుకోలేదన్నారు.

అంతకుముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొజ్జ చినవెంకులు, నారి ఐలయ్య, సిఐటియు జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, వ్యకాస జిల్లా నాయకులు దండెంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, చింతపల్లి బయ్యన్న, లూర్దు మారయ్య, రవినాయక్, పిల్లుట్ల సైదులు, చెరుకు పెద్దులు, వంటెపాక సైదులు, మన్నె భిక్షం, ఆకుల వెంకట్రాములు, ఇటికాల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



కొప్పులలో రాజుకుంటున్న గ్రూపు విభేదాలు

- పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటుపై గొడవ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దమ్మ గుడి ఆలయ నిర్మాణ పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకం విషయమై వివాదం నెలకొనడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఇరు గ్రూపులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిఐసిఎస్ డైరెక్టర్ బగ్గి రమేష్ కథనం ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనచారి రూ.పది లక్షల నిధులు కేటాయించారు. టెండర్లు కాకముందే మరలా ఎన్నికలు రావడం, సిరికొండ ఓటమి చెందడంతో పెద్దమ్మ గుడి నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎమ్మెల్సీగా సిరికొండ ఎన్నికవ్వడంతో పిఏసిఎస్ డైరెక్టర్ రమేష్ మరల ఎమ్మెల్సీ మధుసూదనాచారి వెంటపడి నిధులు తెప్పించగా ఇటీవల టెండర్లు పూర్తయ్యాయి. ఈ నెల 18న భూమి పూజకు ముహూర్తం ఖరారు చేశారు. భూమి పూజ కోసం తయారు చేసిన శిలాఫలకంలో ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించిన ఎమ్మెల్సీ సిరికొండ పేరు కింది వరుసలో ఉండడంతో డైరెక్టర్ రమేష్ సర్పంచ్ భర్తతో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలగజేసుకున్న ఆలయ చైర్మన్ పైడి రమేష్‌తో వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య గొడవ తార స్థాయికి చేరుకొని కట్టెలతో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో డైరెక్టర్ రమేష్ ఎడమ చేతికి గాయమైంది. పైడి కూడా గాయపడటంతో అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పెద్దమ్మ గుడి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఉదయం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అదే రోజు రాత్రి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి కూడా పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.


జాతీయ అవార్డును అందుకుంటున్న 'నారాయణమ్మ' యాజమాన్యం

నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-హైదరాబాద్

జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్, మహిళా కళాశాలకు జాతీయ స్థాయిలో అరుదైన ఐఇఐ అవార్డు దక్కినట్లు ఆ సంస్థ తెలిపింది. వందేళ్ల చరిత్ర కలిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఇఐ) కోల్‌కత్తాచే మహిళ విభాగంలో ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు 2022ను పొందినట్లు పేర్కొంది. ఇటీవల చెన్నయ్‌లో జరిగిన 37వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌లో ఈ అవార్డును తమ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రమేష్ రెడ్డి, ఇంచార్జ్ కె రామలింగా రెడ్డి అందుకున్నారని తెలిపింది.

950 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల ఫలితాలు

- ఆరునెలల్లోనే అత్యంత పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ పూర్తి
- ఎంపికైనవారికి మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యారోగ్య చరిత్రలో సరికొత్త రికార్డు నమోదయింది. 950 సివిల్ అసిస్టెంట్ సర్జన్ రెగ్యులర్ పోస్టుల భర్తీ ప్రక్రియను కేవలం ఆరు నెలల్లో మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డ్ పూర్తి చేసి తుది ఫలితాలు సోమవారం విడుదల చేసింది. వైద్య ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేయడంలో భాగంగా ఒక్క పోస్టునూ ఖాళీగా ఉండకుండా చూసేందుకు భర్తీ ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రంలో 90 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న సిఎం కెసిఆర్ ప్రకటనలో భాగంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు వైద్యారోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసి, ఆరు నెలల లోపే భర్తీ చేసింది. ఇందులో డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ (డిపిహెచ్, ఎఫ్‌డబ్ల్యు) పరిధిలో 734 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) పరిధిలో 209 పోస్టులు, ఐపిఎం పరిధిలో ఏడు పోస్టులు ఉన్నాయి. మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చిన ఆరు నెలల్లోనే ఎంపిక ప్రక్రియ పూర్తిచేసింది. రాత పరీక్ష లేకుండా, నేరుగా మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం విశేషం. ఎంపిక ప్రక్రియ ప్రతి దశలోనూ అత్యంత పారదర్శకంగా సాగింది. డిపిహెచ్, టివివిపి, ఐపిఎం పరిధిలో 969 పోస్టుల భర్తీకి ఈ ఏడాది జూన్ 15వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,803 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి గత నెల తొమ్మిదిన ప్రాథమిక మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. అభ్యంతరాలు ఏమైనా ఉంటే తమకు తెలియజేయాలని సూచించింది. అభ్యర్థుల పూర్తి వివరాలతో సమగ్ర జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం గత నెల 20వ తేదీన రెండో మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. గత నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించింది. 950 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తూ సోమవారం ఫలితాలను విడుదల చేసింది.



సభలో మాట్లాడుతున్న మల్లు రవి

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

- సీనియర్లకు దండం పెడుతున్నాం.. వీధుల్లోకి రావద్దు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీకి ఉందని, కాంగ్రెస్ సీనియర్ నాయకులకు దండం పెడుతున్నాం.. వీధుల్లోకి వచ్చి పార్టీని నాశనం చేయొద్దని రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి కోరారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాకు నూతనంగా నియమించబడిన జి మధుసూదన్‌రెడ్డి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు మెట్టుగడ్డ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అభినందన సభలో మల్లు రవి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని నేడు బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. లౌకిక ప్రజాస్వామ్య దేశాన్ని హిందూ దేశంగా మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్నామన్నారు. పార్టీ అధిష్టానం ఇటీవల అన్ని జిల్లాలకు కొత్త నాయకత్వాన్ని ప్రకటించిందని తెలిపారు. కానీ, పార్టీలో అన్ని రకాల పదవులు అనుభవించిన సీనియర్ నాయకులు నేడు పార్టీకి తలనొప్పిగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానాన్ని ధిక్కరించి వీధుల్లోకి వచ్చి సేవ్ కాంగ్రెస్ నినాదాన్ని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఆ సీనియర్ నాయకులు వీధుల్లోకి వచ్చి పార్టీని భ్రష్టు పట్టించొద్దని కోరారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్, మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు తాగునీరు సాగునీరు అందుతుందంటే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమేనని చెప్పారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, జూరాల ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి అయ్యాయని తెలిపారు. నేడు పార్టీ జిల్లా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్ రెడ్డి సమిష్టి నిర్ణయాలతో సమిష్టి పోరాటాలు చేసి ఈ ప్రాంతంలోని 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు, శ్రేణులు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్‌ను ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి వినోద్ కుమార్, ప్రదీప్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర శేఖర్, కొత్వాల్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు శ్రీహరి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, బెక్కరి అనిత, జహీర్, అక్బర్, లక్ష్మణ్ యాదవ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

40 లక్షల ఉద్యోగార్థులు లక్ష్యం : వర్క్ రూట్

హైదరాబాద్ : కెరీర్ టెక్ వేదిక అయినా వర్క్ రూట్ తన రెజ్యూమ్ బిల్డింగ్ ప్లాట్‌ఫామ్‌లో 40 లక్షల ఉద్యోగ దరఖాస్తు పత్రాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. అన్ని రంగాలకు సంబంధించిన ఇప్పటి వరకు 15 లక్షల రెజ్యూమెలను చేరుకున్నట్లు పేర్కొంది. తమ వేదిక ఉద్యోగార్థులకు ఎటువంటి మానవ ప్రమేయం లేకుండా మొదటి దశ నుండి చివరి దశ దాకా రెజ్యూమ్‌లను రూపొందించడంలో సహాయం చేస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

వివాదంలో ఇన్ఫోసిస్ ప్రాజెక్టు..!

- ఆస్ట్రేలియా ప్రభుత్వం విచారణ

న్యూఢిల్లీ : భారత్‌లో రెండో అతి పెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఓ ఆస్ట్రేలియా ప్రాజెక్టు అంశంలో తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఈ సంస్థ పొందిన 135 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1100 కోట్లు) విలువ చేసే కాంట్రాక్టుపైన ఆస్ట్రేలియా ప్రభుత్వం విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు పలు రిపోర్టులు వచ్చాయి. ఆ దేశ ప్రభుత్వం ఓ కాంట్రాక్టును టెక్ సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించింది. కాగా.. ఈ ప్రాజెక్టు, కాంట్రాక్టు గురించి ఆ దేశ ప్రభుత్వ అధికార పార్టీ లిబరల్ పార్టీ ఆఫ్ ఆస్ట్రేలియా ఎంపి సువార్ట్ రాబర్ట్ ఇన్ఫోసిస్‌తో పాటు తన మిత్రుడు, వ్యాపార భాగస్వామి జాన్ మార్గెరిసన్‌కు చెందిన కన్సల్టెంగ్ సంస్థ సినర్జి 360తో పాటు మరో కంపెనీ యూనిసిస్‌కు లీక్ చేశారని బయటికి వచ్చింది. సున్నితమైన ఈ కాంట్రాక్టు లీకులతో ఇన్ఫోసిస్ సులభంగా ఆ ప్రాజెక్టును దక్కించుకుందని ప్రధాన అరోపణ.

ఎంపి తన అధికారంతో ప్రయివేటు, కార్పొరేటు శక్తులకు కొమ్ముకాశారని అక్కడి మీడియా కథనాలను ప్రచురించింది. దీంతో ఇన్ఫోసిస్‌కు కట్టబెట్టిన ప్రాజెక్టు పైన విచారణ, సమీక్షా చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఎమైనా అవినీతి జరిగిందా అనే కోణంలో అస్ట్రేలియన్ ప్రభుత్వం విచారణ చేపట్టనుందని సమాచారం.